ప్రతి అక్షరం ప్రజాహితం
RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com
నేటి ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
సంపుటి - 03 సంచిక -113 పేజీలు - 04 వెల - 04/- శుక్రవారం 22 మే 2026

## ఎబోలా వైరస్ విజృంభణ

- ఇండియా-ఆఫ్రికా సమిట్ వాయిదా
- ఎయిర్‌పోర్ట్‌లో అడ్వయిజరీ జారీ



**న్యూఢిల్లీ,మే 21 ఆంధ్ర ప్రగతి** ఆఫ్రికాలో ఎబోలా వైరస్ విజృంభిస్తోంది. ముఖ్యంగా కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ వంటి దేశాల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఈ పరిణామాల నడుమ దిల్లీ వేదికగా ఈ నెల 28-31 తేదీల మధ్య జరగాల్సిన 'ఇండియా- ఆఫ్రికా ఫోరమ్ సమిట్' వాయిదా పడింది. భారత్, ఆఫ్రికన్ యూనియన్ మిగతా2లో...

## ఎపిలో భారీ పెట్టుబడులపై
# బాబు ఫోకస్



● ఒప్పంద ప్రాజెక్టులు త్వరగా పూర్తి కావాలి ● వాటికి అవసరమైన చర్యలు తీసుకోవాలి ● మంత్రుల కమిటీతో భేటీలో సిఎం సూచనలు

**అమరావతి,మే 21 ఆంధ్ర ప్రగతి** విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు, రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ)లో ఆమోదించిన ప్రాజెక్టులపై మంత్రుల కమిటీతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. నారా లోకేశ్ నేతృత్వంలోని కమిటీకి ఎంవోయూలు, ప్రాజెక్టుల పురోగతిపై సీఎం దిశానిర్దేశం చేశారు. ఎస్ఐపీబీ ద్వారా ఇప్పటికి రూ.11.47 లక్షల కోట్ల మిగతా2లో...



## తెలుగు రాష్ట్రాల్లో నిప్పుల వాన

ఎండల తీవ్రతతో రికార్డు ఉష్ణోగ్రతలు

పిడుగురాళ్లలో 48.1 ముత్తారంలో 46.5 డిగ్రీలు నమోదు

**హైదరాబాద్/విజయవాడ,మే 21 ఆంధ్ర ప్రగతి** :ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఎండల తీవ్రతతో తెలుగు రాష్ట్రాలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. ఏపీ, తెలంగాణలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. అంతకంతకూ ఎండ తీవ్రత పెరిగిపోయి రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలు బయటకు అడుగుపెట్టాలంటేనే బాబోయో ఎండ అనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆకాశం నుంచి నిప్పుల వర్షం కురిపిస్తున్నాడా అన్నట్లుగా ఉష్ణోగ్రతలు మిగతా2లో...

## చంద్రబాబు సిఎంగా ఉండడం
# ఎపి దురదృష్టం

- మావిగన్ పేరు చెబితే మూకుమ్మడి దాడులా
- ఇప్పటికే అమరావతికి రూ.47,387 కోట్లు అప్పు
- స్కామ్‌ల కోసం రాష్ట్ర ప్రజల వెన్ను విరుస్తున్న బాబు
- పెట్రో, డీజిల్ కొరతతోనూ ప్రజలకు చంద్రబాబు మోసం
- మీడియా సమావేశంలో మండిపడ్డ వైఎస్ జగన్



2లో

## మణుగూరు-రామగుండం
# రైల్వే లైన్‌కు ఆమోదం

● రూ. 5,818.45 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మాణం

● మారుమూల గిరిజన పల్లెలకు పట్టనున్న మహర్దశ

● రైల్వే ప్రాజెక్టులపై అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి చర్చ



**న్యూఢిల్లీ,మే 21 ఆంధ్ర ప్రగతి** తెలంగాణ రాష్ట్రంలో రవాణా రంగాన్ని సరికొత్త ఎత్తుకు తీసుకెళ్లేలా కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న కీలకమైన మణుగూరు-రామగుండం కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టుకు ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ అధికారికంగా ఆమోదముద్ర వేసింది. దాదాపు రూ. 5,818.45 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టును పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం పద్ధతిలో చేపట్టనున్నారు. ఈ కొత్త లైన్ అందుబాటులోకి వస్తే తెలంగాణలోని మారుమూల గిరిజన ప్రాంతాలకు రైల్వే సౌకర్యం మిగతా2లో...

## రూపాయి పతనంపై ఆర్‌బిఐ దిద్దుబాటు

అధికారులతో గవర్నర్ మల్హోత్రా మంతనాలు



2లో

## హైబ్రిడ్ విధానంలో
# టిడిపి మహానాడు



19 తీర్మానాలకు పోలిట్ బ్యూరో ఆమోదం

టిడిపి అధినేత చంద్రబాబు వెల్లడి

**అమరావతి,మే 21 ఆంధ్ర ప్రగతి** హైబ్రిడ్ విధానంలో నిర్వహించే మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సమావేశం ముగిసింది. మహానాడు నిర్వహణ ప్రధాన అజెండాగా సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. కార్యకర్తే అధినేత అనేది మహానాడులో మిగతా2లో...

## విజయ్ కేబినేట్‌లో కొత్తగా 23మందికి చోటు

- ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మంత్రి యోగం

**చెన్నై,మే 21 ఆంధ్ర ప్రగతి** తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే పార్టీ అధినేత విజయ్ తన కేబినెట్‌ను విస్తరించారు. కొత్తగా 23 మంది ఎమ్మెల్యేలు నేడు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. 21 మంది టీవీకే ఎమ్మెల్యేలతో పాటు మిత్రపక్షం కాంగ్రెస్‌కు చెందిన

మిగతా2లో...



## దేశం కోసం ప్రాణాలర్పించిన మహానేత

● సాంకేతికతను దేశానికి పరిచయం చేసిన రాజీవ్

● రాజీవ్‌కు నివాళి అర్పించిన సిఎం రేవంత్



**హైదరాబాద్,మే 21 నేటి ప్రగతి:** దేశం కోసం ప్రాణాలర్పించిన మహా నాయకుడు రాజీవ్‌గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సీఎంతో పాటు కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సాంకేతిక విప్లవాన్ని దేశానికి అందించిన గొప్ప దార్శనికుడు అని కొనియాడారు. 'కంప్యూటర్, ఐటీ, టెలికామ్‌లను దేశానికి తీసుకువచ్చింది ఆయనే. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తెచ్చారు. రాహుల్‌గాంధీ కుటుంబం దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసింది. మిగతా2లో...



## బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు

119 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిల నియామకం

**హైదరాబాద్,మే 21 ఆంధ్ర ప్రగతి** బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కోసం అధినేత కేసీఆర్ ఇన్‌ఛార్జిలను ప్రకటించారు. డిజిటల్ పక్రియలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు జరగనుంది. 119 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలను బీఆర్ఎస్ అధినేత నియమించారు. నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలకు తెలంగాణ భవన్‌లో ఐటీ నిపుణులతో డిజిటల్ శిక్షణ మిగతా2లో...

## హిందువుల మనోభావాలను
# దెబ్బతీసేలా గోవధ

● గోవధ నిషేధ చట్టాలు ఉల్లంఘనలు కోకొల్లలు

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



**హైదరాబాద్,మే 21 ఆంధ్ర ప్రగతి** తెలంగాణలో గోవధ నిషేధ చట్టాలు ఉల్లంఘనకు గురవుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్‌లో గోవుల అక్రమ రవాణా, వధ జరుగుతోందని అన్నారు. చట్టాలు ఉన్నప్పటికీ కొందరు కావాలనే వాటిని ఉల్లంఘిస్తున్నారని ఆయన మండిపడ్డారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గోవధ జరుగుతోందని రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మిగతా2లో...

# తెలుగు రాష్ట్రాల్లో నిప్పుల వాన

(మొదటి పేజీ తరువాయి)

రోజురోజుకూ రికార్డు స్థాయిలో పెరుగుతున్నాయి. గురువారం రాష్ట్రంలో పలుచోట్ల రికార్డు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏపీలో అత్యధికంగా పిడుగురాళ్లలో 48.1, తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.5, సూర్యాపేట జిల్లా మునగాలలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మార్కాపురం జిల్లా కనిగిరిలో అత్యధికంగా 48.3 డిగ్రీలు నమోదు కాగా, కృష్ణా జిల్లా కంకిపాడులో 47.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏలూరు జిల్లా చింతలపూడిలో 47.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు, పల్నాడు జిల్లా అచ్చంపేటలో 47.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు, ఎన్టీఆర్ జిల్లా నందిగామలో 47.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు, ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో 46.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు, బాపట్ల జిల్లా ఇంకొల్లులో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి. ఏపీలోని వేటపాలెం (బాపట్ల), నందివాడ (కృష్ణా)ల్లో 47.6 డిగ్రీలు, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడు, ప్రకాశం జిల్లా అద్దంకిలో 47.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏలూరు జిల్లా అల్లిపల్లిలో 47.3 డిగ్రీలు, నందనమారెళ్ల (మార్కాపురం)లో 46.6, కూనవరం (పోలవరం)లో 46.5, కావలి (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు)లో 46.4, తెనాలి (గుంటూరు)లో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. 20 జిల్లాల్లోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమవారం వరకు ఎండల తీవ్రత కొనసాగనుందని అధికారులు తెలిపారు. తెలంగాణ లోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లిలో 46.4, మహబూబాబాద్ జిల్లా కురవిలో 46.3, ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో 46.2, సిద్ధిపేట జిల్లా అక్కన్నపేట్‌లో 46.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటాయి. భానుడి భగభగలతో జనం ఇంటి నుంచి కాలు బయట పెట్టడానికి భయపడుతున్నారు. ఏమైనా అత్యవసర పరిస్థితి ఎదురైనా ఎండలకు హడలిపోతున్నారు. గత వారం నుంచి ఉదయం మొదలు కొని సాయంత్రం వరకూ తీవ్రమైన ఉక్కపోతతో పాటు సెగలు కక్కే ఎండే కనిపిస్తూ ఉండటంతో సాధారణమైన పనులు చేసుకోవడానికి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఈ ఎండలకు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. ఏసీలు ఉన్న వారు ఏసీ చాటను, ఫ్యాన్లు ఉన్నవారు ఫ్యాన్ల మాటునే సేద తీరుతూ ఊపిరి పీల్చుకుంటున్నారు. సాయంత్రం ఆరు దాటితే గానీ ఎండ తీవ్రత తగ్గకపోవడంతో ఈ ఎండల నుంచి ఎప్పుడు ఉపశమనం పొందుతామా అని ఎదురుచూస్తున్నారు ప్రజలు.

# ఎపిలో భారీ పెట్టుబడులపై బాబు ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడులతో 282 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామని చంద్రబాబు గుర్తుచేశారు. వీటిలో 114 ప్రాజెక్టులు గ్రౌండ్ అయినట్టు సీఎంకు మంత్రుల కమిటీ ఛైర్మన్ నారా లోకేశ్ వివరించారు. భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులకు అనుమతులు, భూ కేటాయింపులతో పాటు మిగిలిన ప్రాజెక్టులు గ్రౌండింగ్‌కు వెళ్లేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. రాష్ట్ర అభివృద్ధికి ఇవి కీలక మైలురాళ్లుగా నిలుస్తాయని సీఎం పేర్కొన్నారు. పెట్టుబడిదారులతో కుదిరిన ఒప్పందాలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా అమలు చేసేలా చర్యలు చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో కుదిరిన ఎంఓయూలకు సంబంధించిన ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు మంజూరు చేయాలని, అవసరమైన భూ కేటాయింపులు పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు ఆదేశించారు. ప్రాజెక్టులు త్వరగా గ్రౌండింగ్ దశకు చేరి పరిశ్రమలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం మాత్రమే కాకుండా, అవి వేగంగా అమలై యువతకు ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం చంద్రబాబు తెలిపారు. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి వేగవంతం చేయడం ద్వారా ఆర్థిక వృద్ధిని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షానికి సీఎస్ సాయిప్రసాద్‌తో పాటు మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, బీసీ జనార్దన్ రెడ్డి, గొట్టిపాటి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# చంద్రబాబు సిఎంగా ఉండడం ఎపి దురదృష్టం

**అమరావతి,మే 21 ఆంధ్ర ప్రగతి** చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండటం ఏపీ చేసుకున్న దురదృష్టమని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. ఏపీకి రాజధాని లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. మావిగన్ అంటే బాబుకు గుండె ఆగిపోయేలా ఉంది. చంద్రబాబు నిర్ణయాలతో భవిష్యత్‌లో కూడా రాజధాని లేకుండా చేస్తున్నారని వైఎస్ జగన్ మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ గురువారం మీడియాతో మాట్లాడుతూ..'చంద్రబాబు కారణంగా ఏపీ ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఇచ్చిన హామీలకు వెన్నుపోటు పొడిచారు. అమరావతిలో రోడ్లు, నీరు, డ్రైనేజీ, మౌలిక సదుపాయాలకే రూ.2లక్షల కోట్లు ఖర్చు అవుతుంది. ఆచరణ సాధ్యం కాదని తెలిసినా అమరావతిపై ముందుకు వెళ్తున్నారు. స్కామ్‌ల కోసమే చంద్రబాబు ముందుకెళ్తున్నారు. ఇప్పటికే అమరావతికి రూ.47,387 కోట్లు అప్పు చేశారు. ఖజానా నుంచి రూ.9200 కోట్లు ఖర్చు చేయబోతున్నారు. స్కామ్‌ల కోసం రాష్ట్ర ప్రజల వెన్ను విరుస్తున్నారు. ప్రశ్నిస్తే చంద్రబాబుకు బీపీ పెరుగుతోంది. రాష్ట్రానికి రాజధాని ఉండాలనే మావిగన్‌ను ప్రతిపాదించాం. రాష్ట్ర పరిస్థితుల దృష్ట్యా మావిగన్‌ను ప్రత్యామ్నాయంగా చూపించాం అన్నారు. అమరావతి అయితే జీరో నుంచి మొదలు పెట్టాలి. చంద్రబాబు స్కామ్‌ల కోసం ఏపీని ఇబ్బంది పెడుతున్నారు. ప్రజలకు కూడా మావిగన్‌కు మద్దతు పలికారు. అది తట్టుకోలేక చంద్రబాబు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు. మంత్రులతో కూడా బూతులు మాట్లాడిస్తున్నారు. రూ.1200 కోట్లతో అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ ఉన్నా మళ్లీ అన్నీ కొత్తగా కడతానంటున్నారు. కొత్తగా నిర్మిస్తున్న 5 బిల్డింగ్‌ల నిర్మాణం పేరుతో చంద్రబాబు దోపిడీ చూస్తే ప్రజలు నివ్వెరపోతున్నారు. భవన డిజైన్లకే రూ.401 కోట్లు. ఈ ఐదు బిల్డింగులకు అయ్యే మొత్తం ఖర్చు రూ. 10,665 కోట్లు.. అంటే ప్రస్తుతం చదరపు అడుగుకు రూ.20,427?. వాటి ఫర్నీచర్, ఇంటీరియర్ ఇంకా అదనపు ఖర్చులన్నమాట.. అంటే చదరపు అడుగుకు రూ.30 వేలు దాటుతుందన్న మాట. మళ్లీ ఇవే నిర్మాణాలకు కొత్త టెండర్లు పిలిచారు.. కానీ, పాత వాళ్లకే ఇచ్చారు. ÷వ్‌స్టార్ హోటల్స్‌కు కూడా చదరపు అడుగు రూ.4,500 లోపే!. తెలంగాణలో రూ.615 కోట్లతో కేసీఆర్ సచివాలయం కట్టారు. మన సెక్రటేరియట్‌కు మాత్రం ఇంత ఖర్చా? ఎందుకు?. కొత్త అసెంబ్లీ, కొత్త హైకోర్టు అంటూ మళ్లీ భారీగా ఖర్చు చేయబోతున్నారు. ఇదంతా విచ్చలవిడిగా చేస్తున్న దోపిడీనే' అని తెలిపారు. ప్రతిపక్ష పార్టీగా గత రెండేళ్లుగా తాము ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నిస్తున్నామని జగన్ తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్‌తో పాటు మొత్తం 143 హామీల అమలు గురించి ప్రజలు కూడా సమాధానం కోరుతున్నారని అన్నారు. పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకోలేదని జగన్ విమర్శించారు. 2014-19 మధ్య కాలంలో కోవిడ్ వంటి క్లిష్ట పరిస్థితులు లేకపోయినా, 2015 ఫిబ్రవరిలో లీటర్‌కు రూ.4 చొప్పున పెట్రోలు, డీజిల్‌పై అదనపు భారం మోపారని గుర్తు చేశారు. అయితే తమ ప్రభుత్వ హయాంలో కోవిడ్ వంటి విపత్కర పరిస్థితులు ఉన్నప్పటికీ, చంద్రబాబు పెంచిన దానికంటే కేవలం ఒక్క రూపాయి మాత్రమే అదనంగా పెంచామని జగన్ పేర్కొన్నారు. ఆ సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ తీవ్ర విమర్శలు చేశారని అన్నారు.ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే పెట్రోలు, డీజిల్‌పై ఉన్న పన్నులను తగ్గించి ధరలు తగ్గిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని జగన్ గుర్తు చేశారు. అదే విషయాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పొందుపరిచారని అన్నారు. ప్రస్తుతం పెట్రోలు, డీజిల్‌పై ఇప్పటికే రూ.4 వరకు అదనపు భారం పెరిగిందని ఆరోపించిన జగన్, చంద్రబాబు గతంలో చెప్పిన మాటల ప్రకారం ఇప్పుడు లీటర్‌కు కనీసం రూ.8 తగ్గించాలి కదా అని ప్రశ్నించారు. ÷ూష్ట్రంలో ఇటీవల ఏర్పడిన పెట్రోలు, డీజిల్ కొరతపై కూడా జగన్ తీవ్ర విమర్శలు చేశారు. ఏప్రిల్ చివరి వారంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెట్రోలు బంకుల వద్ద బారులు తీరారని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల అవసరాలు తీర్చాల్సిన ముఖ్యమంత్రి, అమరావతి కాంట్రాక్టర్లకు రిటైల్ అవుట్‌లెట్ల నుంచి పెట్రోలు, డీజిల్ ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాయడం దారుణమని జగన్ వ్యాఖ్యానించారు. బల్క్‌లో డీజిల్ కొనుగోలు చేస్తే ధర రూ.150 పైగా ఉంటుందని, కానీ రిటైల్ ధర రూ.101 మాత్రమే ఉండటంతో కొందరికి లాభం చేకూర్చే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం కూడా స్పందించిందని జగన్ తెలిపారు. రిటైల్ అవుట్‌లెట్ల నుంచి కమర్షియల్ అవసరాలకు ఇంధనం వాడకూడదని కేంద్రం స్పష్టం చేస్తూ రాష్ట్రానికి లేఖ రాసిందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై స్పందించకుండా సంక్షోభ సమయంలో కూడా స్కామ్‌లకు పాల్పడుతున్నారని ప్రభుత్వం పై జగన్ విమర్శలు గుప్పించారు.

# మణుగూరు-రామగుండం రైల్వే లైన్‌కు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

దక్కడంతో పాటు, ప్రముఖ పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులకు పెద్ద ఉపశమనం లభించనుంది. మొత్తం 207.8 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న ఈ సరికొత్త రైల్వే లైన్ మంథని, భూపాలపల్లి, తాడ్వాయి, గోపాలరావుపేటలతో పాటు ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం మీదుగా వెళ్లనుంది. ప్రస్తుతం మణుగూరు నుండి రామగుండం వెళ్లాలంటే భద్రాచలం రోడ్ (కొత్తగూడెం), కాజీపేట మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. కానీ, ఈ కొత్త లైన్ పూర్తయితే మణుగూరు-రామగుండం మధ్య ఏకంగా 90 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. దీనివల్ల ప్రయాణికులకు సమయం, డబ్బు భారీగా ఆదా అవుతాయి. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరతో పాటు, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి వెళ్లే భక్తులకు కనెక్టివిటీ మరింత సులభతరం కానుంది. ఈ ప్రాజెక్ట్ ముఖ్యంగా ములుగు, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని వెనుకబడిన మారుమూల గిరిజన ప్రాంతాలకు ఒక పెద్ద వరంగా మారబోతోంది. దశాబ్దాలుగా రైలు ముఖం చూడని ఎన్నో గ్రామాలకు ఈ లైన్ ద్వారా రైల్వే కనెక్టివిటీ లభిస్తుంది. కేవలం ప్రయాణికులకు మాత్రమే కాకుండా, ఈ ప్రాంతంలో లభించే బొగ్గు, ఖనిజాలు, ఎరువులు , ఇతర పారిశ్రామిక సరుకు రవాణాకు ఈ రైల్వే లైన్ అత్యంత కీలకంగా మారనుంది. దీనివల్ల సింగరేణి బొగ్గు గనుల రవాణా మరింత వేగవంతం కానుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేసేందుకు రైల్వే శాఖ సరికొత్త ప్లాన్ సిద్ధం చేసింది. డీపీఆర్ తయారీ, భూసేకరణ, వివిధ ప్రభుత్వ శాఖల నుండి అనుమతులు తీసుకునే బాధ్యతలను రైల్వే శాఖ చూసుకుంటుంది. అయితే, ప్రాజెక్ట్ నిర్మాణం , నిధుల సమీకరణ పనులను ప్రైవేట్ భాగస్వామ్య సంస్థకు అప్పగిస్తారు. ఈ ప్రాజెక్ట్ టైమ్‌లైన్ ప్రకారం.. మొదటి ఏడాదిలో పూర్తిగా భూసేకరణ పక్రియను పూర్తి చేసి, ఆ తర్వాత నాలుగు సంవత్సరాల్లో అంటే మొత్తం ఐదేళ్ల వ్యవధిలో ఈ కొత్త రైల్వే లైన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇదిలావుంటే కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గురువారం ఢిల్లీలో కలిశారు.

# హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గోవధ

(మొదటి పేజీ తరువాయి)

గోమాత రక్షణ కోసం శాంతియుతంగా పనిచేస్తున్న గోరక్షకులు, బీజేపీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని రాంచందర్ రావు ఆరోపించారు. గోరక్షకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసిన కార్యకర్తలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ కార్యకర్తలపై విధించిన బైండోవర్ చర్యలను వెంటనే రద్దు చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో గోవుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా రాంచందర్ రావు సూచించారు. గోవధకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

పక్షపాత ధోరణిని విడిచిపెట్టి చట్టాన్ని అందరికీ సమానంగా అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విజ్ఞప్తి చేశారు. గోమాత హిందువుల జీవన విధానంలో పవిత్రమైన భాగమని, పండుగల పేరుతో గోవధ చేస్తే సహించబోమని హెచ్చరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే శక్తులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు.

ఈ సందర్భంగా తెలంగాణలో గోవధ నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన తమ కార్యకర్తలను వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# ఎబోలా వైరస్ విజృంభణ

(మొదటి పేజీ తరువాయి)

కలిసి ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు విదేశాంగశాఖ వెల్లడించింది. కొత్త తేదీలను పరస్పర సంప్రదింపుల ద్వారా ఖరారు చేస్తామని తెలిపింది. ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రజారోగ్యానికి సంబంధించి విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ఆఫ్రికా సీడీసీ, సంబంధిత సంస్థలకు మద్దతు ఇచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉందని విదేశాంగశాఖ పేర్కొంది. మరోవైపు.. ఎబోలా వైరస్ వ్యవహారంలో దిల్లీ ఎయిర్‌పోర్టు అధికారులు కీలక అడ్వైజరీ జారీ చేసిన విషయం తెలిసిందే. కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ నుంచి వచ్చే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జ్వరం, తలనొప్పి, నీరసం, కండరాల నొప్పులు తదితర సమస్యలు కనిపిస్తే వెంటనే ఎయిర్‌పోర్టు వైద్యసిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎబోలా కారణంగా ఇప్పటివరకు 139 మంది మృతి చెందారు. దాదాపు 600 అనుమానిత కేసులను గుర్తించారు. కాంగోలో వైరస్ వ్యాప్తిని ఎదుర్కొనేందుకు తమకు మరింత సామగ్రి, సిబ్బంది అవసరమని అధికార వర్గాలు, సహాయక బృందాలు కోరాయి. మొదటి మరణం నమోదైన బునియా ప్రాంతానికి దాదాపు 20 టన్నుల సహాయ సామగ్రిని తరలించినప్పటికీ.. ఐసొలేషన్ గదుల కొరత కారణంగా వైద్యులు సాధారణ వార్డుల్లోనే ఎబోలా అనుమానిత రోగులకు చికిత్స అందిస్తున్నారు.

# రూపాయి పతనంపై ఆర్‌బిఐ దిద్దుబాటు

**ముంబయి,మే 21ఆంధ్ర ప్రగతి** రూపాయి విలువను స్థిరీకరించడానికి, వడ్డీ రేట్ల పెంపుతో సహా అందుబాటులో ఉన్న అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) పరిశీలిస్తోందని సంబంధిత అధికారులను ఉద్దేశించి 'బ్లూమ్‌బెర్గ్' గురువారం ఒక నివేదికలో వెల్లడించింది. రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు, తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు గవర్నర్ సంజయ్ మల్హోత్రాతో సహా ఆర్‌బీఐ ఉన్నతాధికారులు వరుస అంతర్గత సమావేశాలు నిర్వహించినట్లు ఈ నివేదిక పేర్కొంది. గడిచిన బుధవారం నాటి ట్రేడింగ్‌లో రూపాయి అంతర్గతంగా 96.95 వద్ద రికార్డు స్థాయి కనిష్టానికి పడిపోయింది. ఆ తర్వాత కోలుకుని డాలర్‌తో పోలిస్తే 96.86 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ ఇండెక్స్ బలంగా ఉండటం, ముడి చమురు ధరలు అధికంగా కొనసాగడంతో డాలర్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఈ పరిణామాల వల్లే రూపాయి విలువ చారిత్రక కనిష్ట స్థాయికి పడిపోయి, కొత్త ముగింపు రికార్డును నమోదు చేసింది. అయితే, గురువారం ఉదయం ట్రేడింగ్‌లో రూపాయి తన సర్వకాలిక కనిష్ట ముగింపు స్థాయి నుండి 41 పైసలు పుంజుకుని అమెరికా డాలర్‌తో పోలిస్తే 96.45కు చేరుకుంది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి 96.25 వద్ద బలంగా ప్రారంభమై, ఆ తర్వాత స్వల్పంగా తగ్గి 96.45 వద్ద ట్రేడయ్యింది. బుధవారం నాటి ముగింపు ధర 96.86తో పోలిస్తే ఇది 41 పైసల రికవరీని సూచిస్తోంది.

# హైబ్రిడ్ విధానంలో టిడిపి మహానాడు

(మొదటి పేజీ తరువాయి)

వినిపించాలన్నారు. మహిళలకు తెలుగుదేశం ఇస్తున్న ప్రాధాన్యం మహానాడు వేదికగా అందరికీ అర్థమయ్యేలా చాటాలని సూచించారు. సంప్రదాయ ఓటును జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న బీసీలు పార్టీ ఆవిర్భావం నుంచీ వెన్నుదన్నుగా ఉన్నారని చెప్పారు. బీసీల అభివృద్ధికి పార్టీ కట్టుబడి ఉందనే సందేశం స్పష్టంగా వెళ్లాలని నేతలకు తెలిపారు. రోజూ ఉదయం 9 గంటల నుంచే 2 రోజుల మహానాడు ప్రారంభిద్దామన్నారు. మండల స్థాయిలో నిర్వహిద్దామనే ప్రతిపాదనపైనా చర్చ జరగాలన్నారు. క్లస్టర్ స్థాయిలోనే నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. మహానాడులో ప్రవేశపెట్టే 19 తీర్మానాలకు పొలిట్ బ్యూరో ఆమోదం తెలిపింది. సమయపాలన పాటించాలని.. ప్రతి వక్తా తమకు కేటయించిన అంశంలో నిష్ణాతుడై సమయపాలన పాటిస్తూ విషయం సూటిగా చెప్పాలని ఆదేశించారు. మహానాడులో ప్రవేశపెట్టే తీర్మానాలపై సీఎం చంద్రబాబు పలు సూచనలు చేశారు.

# విజయ్ కేబినేట్‌లో కొత్తగా 23మందికి చోటు

(మొదటి పేజీ తరువాయి)

ఇద్దరు ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటుదక్కింది.జాతీయ మీడియా కథనాల ప్రకారం, తనకు మద్దతిచ్చిన కాంగ్రెస్‌తో పాటు ఐయూఎమ్‌ఎల్, వీసీకే పార్టీలకు కూడా సీఎం విజయ్ కేబినెట్ బెర్తు ఆఫర్ చేశారు. అయితే, మరికొంతకాలం తరువాత ఐయూఎమ్‌ఎల్, వీసీకేలు కేబినెట్‌లో చేరే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. సీపీఐ, సీపీఎంలను కూడా సీఎం విజయ్ మంత్రివర్గంలోకి ఆహ్వానించినట్టు మంత్రి ఆధవ్ అర్జున తెలిపారు. వీసీకే చీఫ్ తోల్ తిరుమావళన్ మంత్రివర్గంలో చేరాలని తాము ఆశిస్తున్నట్టు కూడా పేర్కొన్నారు. మే 10న జరిగిన ప్రమాణస్వీకారంలో విజయ్‌తో పాటు 9 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఇక తమిళనాడు కేబినెట్‌లో గరిష్ఠంగా 35 మంది మంత్రులకు అవకాశం ఉంది. తాజాగా 23 ఎమ్మెల్యేలు మంత్రులుగా చేరడంతో మంత్రి వర్గం సంఖ్య 32కు చేరింది. దీంతో, మరో ముగ్గురు ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటుదక్కే ఛాన్స్ ఉంది.

# దేశం కోసం ప్రాణాలర్పించిన మహానేత

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ సమాజం సోనియాగాంధీ కుటుంబానికి ఎంతో రుణపడి ఉంది. సోనియా సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ సాకారమైంది. మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లులో మోదీ సర్కార్ కుయుక్తులు పన్నింది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు డీలిమిటేషన్‌తో లింక్ పెట్టారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి.. మహిళా బిల్లును ఎన్డీఏ ప్రభుత్వం మళ్లీ పార్లమెంట్‌లో పెట్టాలని సీఎం డిమాండ్ చేశారు. దేశంలో సాంకేతికతను తీసుకొచ్చిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశంలో మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చారని తెలిపారు. సరళీకృత విధానాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ అని చెప్పు కొచ్చారు. సోనియా గాంధీ సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ కల సాకారమైందని సీఎం అన్నారు. తెలంగాణకు గాంధీ కుటుంబంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. అది కుటుంబ సంబంధం కంటే ఎక్కువని తెలిపారు. తెలంగాణ ఉన్నంత వరకు ప్రజలు గాంధీ కుటుంబాన్ని గుర్తు చేసుకుంటారని అన్నారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు తీసుకురావాలన్నారు. తక్షణమే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేసి లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు.మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయాలు చేయాలనుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఎంతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు... రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు దానం నాగేందర్, అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వనున్నారు. సభ్యత్వ నమోదు కోసం డిజిటల్ యాప్‌ను రూపొందించారు. తెలంగాణ భవన్‌లో శిక్షణ తర్వాత.. పార్టీ జిల్లా కార్యాలయాల్లో పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జిల ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. పోలింగ్ బూత్‌కు ఇద్దరు చొప్పున వారం రోజుల పాటు శిక్షణ శిబిరాలు నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. డిజిటల్ సభ్యత్వ నమోదు శిక్షణ పూర్తయిన తర్వాత.. సభ్యత్వ పునరుద్ధరణను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రారంభించనున్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం 22 మే 2026

# నంద్యాలలో జొన్న రైతుల ఆందోళన..



## ప్రభుత్వ నిర్లక్ష్యం.!

- పావు వంతు పంటను కూడా కొనుగోలు చేయని ప్రభుత్వం.
- మధ్య దళారీల దోపిడీకి సహకరిస్తున్న ప్రభుత్వాలు.
- నంద్యాల సెంట్రల్ వేర్ హౌస్ గోడౌన్ నుండి కిలోమీటర్ మేరా ఆగిపోయిన జొన్న రైతుల వాహనాలు.
- జిపిఎస్, ట్రక్ సీట్ లేని వాహనాల జొన్నలను కొనలేమని చెప్పుతున్న సివిల్ సప్లై మరియు మార్క్ ఫెడ్ అధికారులు.
- ఎలాంటి షరతులు లేకుండా జొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్.













**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 21:** నంద్యాల జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద కిలోమీటర్ల మేర జొన్నలుతెచ్చిన జొన్న లారీలు మరియు ట్రాక్టర్ వాహనాలు గత రెండు రోజుల క్రితం నుండి ఆగిపోవడం మూలంగా నంద్యాల పట్టణంలో ట్రాఫిక్కు అంతరాయం మరియు రెండు రోజుల నుండి లైన్ లో నిలబడినటువంటి రైతుల కు సరైనటువంటి తాగునీరు,వసతి, నిలువ నీడ లేక ఇబ్బంది పడడం, అద్దెకు తెచ్చుకున్న వెహికల్స్ కు అద్దె చెల్లించడం కూడా భారం అయిన రైతులంతా ఒక్కసారిగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘంఆధ్వర్యంలో నంద్యాలలోని సెంట్రల్ వేర్ హౌస్ గోడౌన్ వద్ద ఆందోళనకు దిగారు. వెంటనే క్యూ లైన్ లో నిలబడిన వాహనాల నుండి జొన్నలు కొనుగోలు చేయాలని, కొనుగోళ్ల విషయంలో రాజకీయ జోక్యం ఉండరాదని, ట్రక్ సీట్లతో సంబంధం లేకుండా రైతుల వద్ద ఉన్న మొత్తం జొన్నలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గడిచిన 10 రోజుల క్రితం కూడా కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా చేసి రైతుల వద్ద ఉన్న మొత్తం జొన్నలను ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని అదనంగా మన జిల్లాలో కొనుగోలు చేయడానికి అనుమతినివ్వాలని కోరడం జరిగింది.ప్రభుత్వ అధికారుల లెక్కల ప్రకారంజిల్లాలో 54 వేల ఎకరాలలో జొన్న పంట సాగు అయిందని, లక్ష మెట్రిక్ టన్నులకు పైగా దిగుబడి వస్తుందని అంచనా వేసి, కేవలం 28 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ప్రభుత్వం నుండి జొన్నలు కొనుగోలు చేస్తామని అందులో ఒక ఎకరాకు 20 కింటాలు వరకు, ప్రతి రైతుకు 5 ఎకరాల లోపు మాత్రమే కొనుగోలు చేస్తామని షరతులు విధించారు. ఈ మేరకు కొనుగోలు 15 రోజులు క్రితం నుండి ప్రారంభమైంది. అందుకు ప్రతి మండలంలో గ్రామాల కెళ్ళి అధికారులు వారి దగ్గర ఉన్న పంట నమోదు ఆధారంగా సీరియల్ నంబర్ కేటాయిస్తూ, జిపిఎస్ కలిగిన వాహనాలకు ట్రక్ సీట్ ఇవ్వడం జరిగింది. అయితే గత రెండు రోజుల క్రితం నుండి గ్రామాల్లో ట్రక్ సీట్ ఇవ్వడంలో సీరియల్ నంబర్ పాటించడం లేదని రాజకీయ జోక్యంతో పలుకుబడి కలిగిన రైతులకు మాత్రమే ఇస్తున్నారని, ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం 28 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు పూర్తవుతుంది అనేటటువంటి భయంతో చాలామంది రైతులు ట్రక్ సీట్ లేకుండానే గడివేముల మండలం పెసర వాయి, భుజనూర్ కొరటమద్ది, కరిమద్దెల, గ్రంధి వేముల మరియు వేలుగోడు మండలంలోని అబ్దుల్లాపురం, రేగడ గూడూరు గ్రామాల నుండి అత్యధిక సంఖ్యలో రైతులు లారీలు మరియు సొంత ట్రాక్టర్లలో జొన్న బస్తాలు ఎత్తుకొని వచ్చి క్యూ లైన్ లో రెండు రోజుల నుంచి ఎదురు చూస్తూ ఉండడం జరుగుతున్నది. అయితే జిల్లా సివిల్ సప్లై మరియు మార్ఫెడ్ అధికారులు టక్ సీట్ లేనటువంటి, జిపిఎస్ లేనటువంటి వెహికల్ ను అనుమతించమని , మాకు ఇచ్చిన టార్గెట్ అయిపోయిందని చెప్పడంతో ఆగ్రహించిన రైతాంగం తిరగబడి, రైతుసంఘం ఆధ్వర్యంలో అధికారుల ముందు తమ ఆందోళన ,నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి. రామచంద్రుడు మరియు పలు గ్రామాల రైతు నాయకులు అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ట్రక్ సీట్ ఇచ్చే విషయంలో రాజకీయ జోక్యం పెరగడంతో రైతుల్లో ఆందోళన మొదలైందని, ప్రభుత్వం కేవలం కొంతమందివి మాత్రమే 28 వేల మెట్రిక్ టన్ను లోపు మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పడంతో మరింత అనుమానం ఆందోళన రైతాంగంలో పెరిగి, తమ వద్ద ఉన్న నిల్వలని ఆగిపోతాయని భయంతో ఒక్కసారిగా నంద్యాల కొనుగోలు కేంద్రం వద్దకు తరలి వచ్చామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పష్టంగా జిల్లాలో పండిన 54 వేల విస్తీర్ణానికి తగ్గట్టు ఉత్పత్తి అయిన సుమారు లక్షల మెట్రిక్ టన్నుల జొన్నలను కొనుగోలు చేస్తేనే సమస్య పరిష్కారం అవుతుంది, అందుకు స్పష్టమైన హామీ ప్రభుత్వం నుండి ఇవ్వమని రైతు సంఘాల నాయకులు అడిగారు.అందుకు అధికారులు ఒప్పుకోకుండా, మాకు అదనంగా కొనుగోలు చేయటానికి అధికారం లేదని, ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చే వరకు వెనక్కి వెళ్లాలని అధికారులు సూచించడంతో ఇదెక్కడి న్యాయం ఓట్ల కోసం వచ్చినప్పుడు రైతులకు న్యాయం చేస్తాం ,మద్దతులను అమలు చేస్తాం, రైతుల మొత్తం పంటలను కొంటామని మాయ మాటలు చెప్పి తీరా కొనుగోలు కేంద్రాలకు వచ్చిన తర్వాత కొంతమేరకు మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పడం అన్యాయమన్నారు. ఈ రోజే మాకు కొనుగోలు విషయమై తేల్చి చెప్పాలని పట్టుపట్టగా పోలీస్ అధికారుల జోక్యంతో, మార్ఫెడ్ అధికారిని శ్రీమతి అనూష, సివిల్ సప్లై డిఎం నాయక్ ఈరోజు లైన్ లో ఉన్న అన్ని వాహనాలకు ఎలాంటి షరతులు పెట్టకుండా ట్రక్ సీట్ లేకుండా కచ్చితంగా కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో కాస్త ఆందోళన సద్దుమణిగింది. అయితే ఇంకా జిల్లాలో రైతుల వద్ద నిల్వ ఉన్న జొన్నలను ఎలా కొనుగోలు చేసుకోవాలి , ఇప్పుడే స్పష్టమైన వైఖరి ప్రకటించాలని రైతులు డిమాండ్ చేయగా కలెక్టర్ మేడం గారి దృష్టికి తీసుకెళ్లామని, కలెక్టర్ గారు ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నధని, వీలైనంత త్వరగా ప్రభుత్వ పర్మిషన్ రావటానికి కృషి చేస్తున్నామని తెలియ చెప్పారు. తాత్కాలికంగా నేడు లైన్లలో వేచి ఉన్న రైతులందరీ వాహనాలకు అనుమతి ఇవ్వడంతో తాత్కాలికంగా ఆందోళన విరమించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు సురేష్ , శ్రీనివాసరెడ్డి, బెలూన్ హుస్సేన్ రెడ్డి తో పాటు వివిధ గ్రామాలరైతుల పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్ పేలి భారీ అగ్నిప్రమాదం..

..ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధం.. భారీ ఆస్తి నష్టం.





**ఆంధ్ర ప్రగతి వెలుగోడు మే 21:** నంద్యాల జిల్లా వెలుగోడు పట్టణంలోని అయ్యప్పరెడ్డి నగర్‌లో బుధవారం గ్యాస్ సిలిండర్ పేలడంతో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇంట్లోని సామగ్రి పూర్తిగా కాలిపోగా భారీ ఆస్తి నష్టం సంభవించింది.స్థానికుల కథనం మేరకు.. యన్. పుల్లయ్య (తండ్రి పెద్ద అయ్యన్న), ఆంజనేయులు (తండ్రి పుల్లయ్య) కుటుంబ సభ్యులు చేపల వేట కోసం ఉదయం ఇంటి నుంచి వెళ్లారు. ఇంట్లో సుమారు పది మంది వరకు నివాసం ఉంటున్నట్లు సమాచారం. వారు బయటకు వెళ్లిన సమయంలో అకస్మాత్తుగా గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇంటిలో మంటలు చెలరేగాయి. మంటలు ఎగిసిపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే ఇంట్లోని గృహోపకరణాలు, అవసరమైన వస్తువులు పూర్తిగా కాలిపోయినట్లు తెలిసింది. ఈ ఘటనలో ఎవరికి ప్రాణాపాయం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు, ఫైర్ అధికారులు ఘటనపై విచారణ చేపట్టారు.





# ఉచిత ఇసుక పాలసీ ని పటిష్ఠంగా అమలుచేస్తున్నాం.

..గనుల రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

..అక్రమ మద్యం నియంత్రణ, కల్తీ మద్యం నివారణ పై ప్రత్యేక దృష్టి సారించాం.

..రాష్ట్రం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది.

..రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర.



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, మే 21:** రాష్ట్రంలో ఉచిత ఇసుక పాలసీ ని పటిష్ఠంగా అమలుచేస్తున్నామని, గత రెండేళ్లుగా ప్రజలకు ఇసుక అందించడం లో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంత్రి మైనింగ్ మరియు ఎక్సైజ్ శాఖల అధికారులతో సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే విధంగా పరిపాలన చేయాలన్న లక్ష్యంతో పని చేస్తోందన్నారు. అపారమైన ఖనిజ సంపద ఆంధ్ర రాష్ట్రంలో ఉందని, ఈ వనరుల ద్వారా అటు ప్రభుత్వానికి ఆదాయం , ప్రజలకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆ మేరకు ప్రభుత్వం వచ్చిన వెంటనే సాండ్ పాలసీ మైనింగ్ పాలసీ, ఎక్సైజ్ పాలసీ లను అమలు చేయడం జరుగుతోందన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక పాలసీ అమలు అస్తవ్యస్తంగా జరగడం వల్ల కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. ఎన్ టి జి లో కేసులు పడ్డాయని,అధికారులు కోర్టులకు వెళ్లవలసి వచ్చిందని తెలిపారు.. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వచ్చిన వెంటనే ఫ్రీ సాండ్ పాలసీ అమలు చేసిందని, ఈ రెండు సంవత్సరాలు కూడా ఎక్కడా ఇబ్బంది రాకుండా పర్యవేక్షించి లబ్ధిదారునికి తక్కువ ధరకే ఇసుక అందించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. రూ. 202 రూపాయలకే ఇసుక అందిస్తున్నామని, రవాణా దూరాన్ని బట్టి చార్జెస్ చేయడం జరుగుతుందని తెలిపారు.. వర్షాకాలానికి ముందే సరిపడా ఇసుక నిలువలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ రెండు సంవత్సరాల్లో దాదాపు 250 కోట్ల పైనే ప్రజల మీద భారం పడకుండా ప్రభుత్వం ప్రజలకు ఇసుక అందజేసిందన్నారు. ఇసుక సరఫరాలో ఏదైనా ఇబ్బందులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నామని, ఏదైనా తప్పులు చేస్తే సీరియస్ యాక్షన్ తీసుకోవడం జరుగుతోందని మంత్రి తెలిపారు. అలాగే మైనింగ్ రంగ అభివృద్ధికి కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సంవత్సరం 30% గ్రోత్ మైనింగ్ రంగంలో తీసుకొని వచ్చా మన్నారు. జిల్లాలో జొన్నగిరిలో గోల్డ్ మైన్స్ ఆపరేషన్ లోకి వచ్చిందని మంత్రి తెలిపారు. ఇదే కాకుండా మరో రెండు, మూడు ఐడెంటిఫై చేశామన్నారు. దీనివల్ల భవిష్యత్తులో రాష్ట్రానికి ఆదాయం తెచ్చే విధంగా ఉంటుందన్నారు. అలాగే ఎక్సైజ్ డిపార్ట్మెంట్లో ప్రత్యేకంగా ఒక పాలసీ తీసుకువచ్చామన్నారు. నవోదయ 2.0 ద్వారా నాటు సారా నిర్మూలన పై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఎల్సిడి లిక్కర్ లేకుండా చేశామని తెలిపారు. ఈరోజు అతి తక్కువ ధరకే రూ.99 కే లిక్కర్ తీసుకొని రావడం జరిగిందని తెలిపారు.

కల్తీ మద్యం లేకుండా దాదాపుగా ఐదు ప్రాంతాల్లో ల్యాబ్స్ పెట్టి 13 రకాల పరీక్షలు చేసి, ప్రజల ఆరోగ్యం గురించి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. సురక్ష యాప్ తీసుకొని వచ్చామని, ఇప్పటివరకు ఒక్క బాటిల్ కూడా ఎక్కడ ట్రేస్ కాలేదని, డిస్టిలరీ ల నుంచి, డిపోల దగ్గర నుంచి, షాప్ దగ్గర నుంచి శాంపుల్స్ ఎప్పటికప్పుడు తెప్పించి టెస్టులు చేసి ఎక్కడ కూడా కల్తీ జరగకుండా చేయడం జరిగిందని తెలిపారు. ఎన్ఫోర్స్మెంట్ అని కూడా బలోపేతం చేశామని, వీటి ద్వారా క్రైమ్ కంట్రోల్ చేయడం జరుగుతోందని మంత్రి తెలిపారు. కొంతమందిపై పీడి యాక్ట్ కేసులు కూడా నమోదు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రభుత్వం కృషి చేస్తోందని, జిల్లాలో డ్రోన్ సిటీ, రిలయన్స్ ల వంటి పరిశ్రమలతో పాటు ఓర్వకల్లు ప్రాంతంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయన్నారు. అలాగే మొన్ననే డిఫెన్స్ రంగానికి సంబంధించి పుట్టపర్తిలో ముఖ్యమంత్రి, రక్షణ మంత్రి చేతుల మీద శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రపంచ దిగ్గజ సంస్థలన్నీ మన రాష్ట్రం వైపు వస్తున్నాయి, ఎందుకంటే ప్రభుత్వం కల్పిస్తున్న స్పీడ్ అఫ్ డూయింగ్ బిజినెస్, ముఖ్యమంత్రి చేస్తున్నటువంటి పాలసీల వల్లే అని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో ఆంధ్ర రాష్ట్రాన్ని నెంబర్ వన్ గా తీర్చిదిద్దడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# విజిబుల్ క్లీన్‌లినెస్ లక్ష్యంగా నాలుగు వారాల ప్రత్యేక కార్యాచరణ.

..ఆరు మున్సిపాలిటీల్లో పరిశుభ్రత పనులు వేగవంతం చేయాలి.

..డ్రైన్లు, గార్బేజ్ పాయింట్లు, పబ్లిక్ టాయిలెట్లపై ప్రత్యేక దృష్టి.

..బల్క్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఆన్-సైట్ కంపోస్టింగ్ అమలుకు చర్యలు.

..జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 21:**
నంద్యాల జిల్లాలోని నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, డోన్, బేతంచర్ల మున్సిపాలిటీల పరిధిలో పరిశుభ్రతను మరింత మెరుగుపర్చేందుకు నాలుగు వారాల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ "విజిబుల్ క్లీన్‌లినెస్" కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, అన్ని మున్సిపల్ పట్టణాల్లో వచ్చే నాలుగు వారాల్లో "విజిబుల్ క్లీన్‌లినెస్" లక్ష్యాన్ని సాధించే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మొదటి వారంలో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మార్కెట్ ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలు వంటి ప్రజా రద్దీ ప్రదేశాల్లో పాన్, గుట్కా ఉమ్మివేతల వల్ల ఏర్పడిన ఎరుపు మచ్చలు, బహిరంగ మూత్రవిసర్జన ప్రాంతాల్లో కనిపించే పసుపు మచ్చలను గుర్తించి పూర్తిస్థాయిలో శుభ్రపరచాలని తెలిపారు. రోడ్లను పూర్తిగా శుభ్రం చేయడంతో పాటు డివైడర్లు, కర్బ్‌లైన్లు, ఫుట్‌పాత్‌లకు పెయింటింగ్ చేపట్టాలని, స్పీడ్ బ్రేకర్లను మరమ్మతులు చేసి తెల్లటి గుర్తులు వేయాలని ఆదేశించారు. రహదారుల ఇరువైపులా సైడ్ మార్కింగ్ పనులు కూడా పూర్తి చేయాలని పేర్కొన్నారు. రెండవ వారంలో అన్ని రకాల డ్రైనేజీ కాలువలను పూర్తిగా శుభ్రపరిచి, మురుగునీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రెయిన్ల శుభ్రతపై ప్రత్యేక మానిటరింగ్ నిర్వహించాలని తెలిపారు. మూడవ వారంలో వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, మార్కెట్లు, రైతు బజార్లలో ఎక్కువ మొత్తంలో చెత్త ఉత్పత్తి చేసే బల్క్ వేస్ట్ జనరేటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వ్యాపారులు రోడ్లపై చెత్త వేయకుండా ప్రత్యేక చెత్త సేకరణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఆన్-సైట్ కంపోస్టింగ్, బయోడైజెస్టర్ ప్లాంట్ల వినియోగంపై కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్‌కు అడ్వైజరీ నోట్లు జారీ చేయాలని పేర్కొన్నారు.
నాల్గవ వారంలో అన్ని పబ్లిక్ టాయిలెట్లను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు, పాత చెత్త నిల్వ కేంద్రాలు, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు, ఖాళీ స్థలాలను పూర్తిగా శుభ్రపరచాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో చెత్త పేరుకుపోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నాలుగు వారాల కార్యక్రమంలో చేపట్టిన పనులన్నింటినీ సమగ్రంగా క్రోడీకరించి నివేదిక రూపంలో ప్రభుత్వానికి సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలు, అధికారిక కార్యక్రమాల సమయంలో జిల్లాలో చేపట్టిన పరిశుభ్రత చర్యలు ప్రతిష్ఠాత్మకంగా కనిపించేలా ఉండాలని అన్నారు. పరిశుభ్రత కార్యక్రమాలను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలు, జడ్జీలు రానున్న నేపథ్యంలో అన్ని మున్సిపాలిటీలు ముందస్తుగా సిద్ధంగా ఉండాలని, ప్రతి ప్రాంతంలో పరిశుభ్రత స్పష్టంగా కనిపించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# ఆపరేషన్ ప్లేజ్ కార్యక్రమం పై సమీక్ష.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల అర్బన్ మే 21:** స్వచ్ఛ సర్వేక్షన్2025-26 కార్యక్రమంలో భాగంగా రేపటి నుండి నంద్యాల పురపాలక సంఘం పరిధిలో స్వచ్ఛ సర్వేక్షన్ టీమ్ సర్వే నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో పురపాలక సంఘం కమిషనర్ శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, మున్సిపల్ డి ఈలు మరియు సచివాలయం సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో పట్టణ పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, ప్లాస్టిక్ నియంత్రణ మరియు ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అందరూ పరిశుభ్రమైన నంద్యాల నిర్మాణానికి సహకరించాలని కోరడమైనది. అలాగే ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం మే 22 వ తేదీ నుండి 20 జూన్ 2026 వరకు నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమం మొత్తం 4 వారాలపాటు కొనసాగుతుంది. ప్రతి వారం ప్రత్యేక అంశాలపై పరిశుభ్రత కార్యక్రమాలు, మురుగు కాలువల శుభ్రపరిచే పనులు, చెత్త నిర్మూలన, పబ్లిక్ టాయిలెట్ల పరిశుభ్రత మరియు పట్టణ అందీకరణ కార్యక్రమాలు చేపట్టబడనున్నాయి. కావున నంద్యాల పట్టణ ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములై పరిశుభ్రమైన పట్టణ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించవలసిందిగా కోరడమైనది.

# ఇన్నోవేటివ్ బెస్ట్ ప్రాక్టీసెస్‌తో శాఖలు ముందుకు రావాలి.

..జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 21:**
జిల్లాలో గ్రామీణాభివృద్ధి, పరిశుభ్రత, మహిళా సాధికారత, ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాలలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ వినూత్న కార్యక్రమాలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా ప్రతి శాఖ "బెస్ట్ ప్రాక్టీసెస్" రూపకల్పన చేసి అమలు చేయాలని సూచించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో "బెస్ట్ ప్రాక్టీసెస్"పై స్త్రీ శిశు సంక్షేమ శాఖ, జిల్లా పంచాయతీ కార్యాలయం (డీపీఓ), ఆర్ అండ్ బీ, సహకార శాఖ, హౌసింగ్, డీఆర్‌డీఏ, ఆర్టీసీ, డ్వామా, పశుసంవర్ధక శాఖ తదితర విభాగాల అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలను ప్రజెంటేషన్ రూపంలో వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి శాఖ తమ పరిధిలో సృజనాత్మక ఆలోచనలతో ముందుకు వచ్చి గ్రామీణాభివృద్ధికి ఆదర్శంగా నిలిచే విధంగా కార్యక్రమాలు రూపొందించాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా ప్రజలకు కనిపించే విధంగా, ఫలితాలు ఇచ్చే విధంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రత్యేకంగా ఆర్ అండ్ బీ, సహకార శాఖ, డీఆర్‌డీఏ, ఆర్టీసీ శాఖలు ప్రదర్శించిన "బెస్ట్ ప్రాక్టీసెస్"లను మరింత మెరుగుపరచి, ప్రజలకు ఉపయోగకరంగా తీర్చిదిద్దాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం పెంచి, వినూత్న పద్ధతుల్లో సేవల అందింపుపై దృష్టి సారించాలని అధికారులకు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పచ్చదనం పెంపుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంటూ, గ్రామీణ రహదారులను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు "స్వచ్ఛపదం" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని డీపీఓను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అమలయ్యే ప్రతి వినూత్న కార్యక్రమం ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలిచేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# అక్రమ మద్యం, నాటు సారాను సమూలంగా నిర్మూలించాలి.

..నాటు సారా తయారీ మాన్పించి, వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించాలి.

..ప్రజల ఆరోగ్యం ముఖ్యం.

..పదే పదే సారా తయారు చేసే వారిపై పిడి చట్టం ప్రయోగించండి.

..రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర.




**ఆంధ్ర ప్రగతి కర్నూలు, మే 21:** అక్రమ మద్యం, నాటు సారాను సమూలంగా నిర్మూలించాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో ఎక్సైజ్ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బోర్డర్ జిల్లాలు, సరిహద్దు ప్రాంతాల నుండి మద్యం అక్రమ రవాణాను పూర్తిగా నియంత్రించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా నాటు సారా తయారీ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.. సెప్టెంబర్ నాటికి పాలసీ అయిపోతుందని, మరల ఫ్రెష్ పాలసీపై త్వరలోనే డైరెక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. మద్యం షాపుల టైమింగ్స్ విషయంలో, ఎంఆర్పీ ధరల ఉల్లంఘనల విషయంలో ఎట్టి పరిస్థితుల్లో కూడా రాజీపడకూడదన్నారు. ప్రజల ఆరోగ్యం ముఖ్యం అని, దాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు పని చేయాలన్నారు. ఎన్ఫోర్స్‌మెంట్ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో నాటుసారా తయారీ మానేసిన వారికి ప్రత్యామ్నయంగా ఉపాధి చాలా బాగా కల్పిస్తున్నారని మంత్రి జిల్లా యంత్రాంగాన్ని మనస్ఫూర్తిగా అభినందించారు. భవిష్యత్తులో కూడా దీన్ని కొనసాగించాలని మంత్రి అధికారులకు సూచించారు. పదే పదే సారా తయారు చేసే వారిపై పిడి చట్టం ప్రయోగించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.
జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మాట్లాడుతూ జిల్లాలో అక్రమ మద్యం రవాణా, నాటు సారా తయారీ నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నాటుసారా తయారీ మానేసిన వారికి ఇప్పటికే 36 మందికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడం జరిగిందన్నారు.. పెండింగ్ లో ఉన్న 50 మందికి కూడా నెల రోజుల లోపు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్డీపీఎల్ (నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్) క్రైమ్ చాలా వరకు తగ్గిందని వాటిని మరింత తగ్గించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం ధరల ఎంఆర్‌పి ఉల్లంఘనలు, షాప్ టైమింగ్స్ ను క్షుణ్ణంగా పర్యవేక్షిస్తున్నామని, ఇంకా కొంచెం విజిలెన్స్ పెంచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పునరావృత నేరస్థులు ఎవరైతే ఉన్నారో వారి మీద పీడీ కేసెస్ బుక్ చేస్తున్నామని, ముగ్గురి మీద పీడీ యాక్ట్ బుక్ చేయడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ మరియు పోలీస్ డిపార్ట్మెంట్ ఇద్దరూ నిరంతర సమన్వయంతో పని చేస్తున్నామన్నారు.



ముఖ్యంగా ఇంటర్-బోర్డర్ మూవ్‌మెంట్ లేదా ఐడీ లిక్కర్ (ఇల్లీగల్ లిక్కర్) ఎన్ఫోర్స్‌మెంట్, అలాగే గంజాయి ఎన్ఫోర్స్‌మెంట్ కు సంబంధించి సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి కర్నూలు నంద్యాల జిల్లాలో ఎక్సైజ్ శాఖ తీసుకుంటున్న చర్యలను గురించి వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ హనుమంత రావు, సూపరింటెండెంట్ సుధీర్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, మంత్రాలయం టీడీపీ పార్టీ ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్మాణాలకు భూసేకరణ ప్రక్రియ వేగవంతం.

..రైతుల సమ్మతితో నష్టపరిహార ప్రతిపాదనలకు ఆమోదం - కలెక్టర్ జి. రాజకుమారి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 21:**
పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్య వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్ లో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్మాణం కొరకు నందికొట్కూరు, ఆత్మకూరు మున్సిపాలిటీల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, నందికొట్కూర్, ఆత్మకూరు మండల తాసిల్దార్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నందికొట్కూరు, ఆత్మకూరు మున్సిపాలిటీలలో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 704లో ఉన్న రెండు ఎకరాల భూమికి సంబంధించి రైతు సమ్మతి తెలిపినందున, ఆ భూమి భూసేకరణ ప్రతిపాదనను తదుపరి ఆమోద ప్రక్రియకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 759లో సుమారు 1.50 ఎకరాల భూమికి సంబంధించి రైతుతో సావధానంగా చర్చించి సంబంధిత ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.
పట్టణాల్లో శాశ్వత పారిశుధ్య నిర్వహణ, కాలుష్య నియంత్రణ మరియు ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా ఎస్‌టిపి నిర్మాణాలు అత్యంత కీలకమని, ఇందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా, రైతుల సహకారంతో ముందుకు తీసుకెళ్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

## ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో టిడ్కో, హౌసింగ్ స్థలాలపై మంత్రి ఫరూక్ సమీక్ష.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 21:** నంద్యాల పట్టణ పరిధిలోని టిడ్కో గృహాలు, హౌసింగ్ స్థలాల కేటాయింపు ప్రక్రియపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు ఒక ప్రత్యేక సమీక్షా సమావేశం, అనంతరం స్థలాల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఫరూక్ అధికారులతో మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ త్వరితగతిన ఇళ్ల స్థలాలు, టిడ్కో గృహాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. హౌసింగ్ మరియు టిడ్కో ప్రాజెక్టులకు సంబంధించిన పనుల పురోగతిని, లబ్ధిదారుల వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా ఎలాంటి జాప్యం లేకుండా మౌలిక వసతుల కల్పన పూర్తి చేసి, అర్హులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. అనంతరం సంబంధిత స్థలాల పరిశీలనలో భాగంగా అధికారులు క్షేత్రస్థాయి నివేదికలను మంత్రి ఫరూక్ కి సమర్పించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ శేషన్న మరియు ఇతర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేత్రదానం చేసి ఆదర్శంగా నిలిచిన స్వర్గీయ నల్లగట్ల శ్రీరాములు.

..రెడ్ క్రాస్ అధ్వర్యంలో 25వ నేత్ర దాన సేకరణ.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 21:**
నంద్యాల పట్టణంలోని స్టేట్ బ్యాంకు కాలనీలో నివసిస్తున్న నల్లగట్ల శ్రీరాములు ఈరోజు మరణించడంతో వారి కుటుంబ సభ్యులలో ఒకరైన వారి కుమారుడు కాంట్రాక్టర్ నల్లగట్ల విజయకుమార్ స్పందించి వారి తండ్రి చివరి కోరిక మేరకు నేత్రదానం చేయాలని సంకల్పించడంతో, ఈ విషయాన్ని జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆర్గాన్ డొనేషన్ కో ఆర్డినేటర్ ఖండే ఆనంద్ గురూజీకి, తెలియజేయడంతో వారు వెంటనే స్పందించి రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్లకు సమాచారం అందించగా వారు కర్నూలు నుండి టెక్నీషియన్స్ పిలిపించి అతని రెండు నేత్రాలను సేకరించారు.



ఈ సందర్భంగా ఖండే ఆనంద్ గురూజీ మాట్లాడుతూ.. నేను రెడ్ క్రాస్ సొసైటీ కోఆర్డినేటర్గా ఎన్నికైన తర్వాత ఒక సంవత్సర కాలంలోనే శ్రీరాములుతో కలిపి 25 మందితో నేత్రాలను సేకరించి రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి ఆధ్వర్యంలో ఎల్ వి ప్రసాద్ హాస్పిటల్ కు పంపడం జరిగిందన్నారు. అలాగే ప్రతి ఒక్కరు కూడా మరణించిన తర్వాత మట్టిలో కలిసిపోయే దానికంటే కాలి బూడిద అయ్యేదానికంటే ఇద్దరికీ చూపులు ప్రసాదించిన వారవుతారు.
కాబట్టి ప్రతి ఒక్కరు కూడా వీరిని ఆదర్శంగా తీసుకొని వారు వారి కుటుంబ సభ్యులకు చివరి కోరికగా నేత్రాలను సమర్పించమని తెలియజేయవలసిందిగా కోరారు.
అలాగే మన భారత దేశంలో సంవత్సరానికి సుమారు 50 వేల మందికి పైగా నేత్రాలు కోల్పోయి అంధకారంలో జీవిస్తున్నారని, అటువంటి వారికి నేత్రదానం చేసి ఈ సువిశాల ప్రపంచాన్ని చూసే విధంగా ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. నేత్రదానం చేయదలచిన వారు వయసుతో సంబంధం లేకుండా, శుక్లమ ఆపరేషన్ చేయించుకున్న కూడా మరణించిన తర్వాత నేత్రాలను దానం చేయగలరని అలాగే మరణించిన తర్వాత శరీర దానం చేయుటకు కూడా ఇప్పటికీ నలుగురు వ్యక్తులు వారు కుటుంబ సభ్యులకు తెలియజేసి మాకు లిఖితపూర్వకంగా కూడా అందజేశారన్నారు.
ఇలా ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నల్లగట్ల శ్రీరాములు గారి కుమారుడు విజయ్ కుమార్ మాట్లాడుతూ వారి తండ్రి మరణించిన తర్వాత నేత్రాలను దానం చేయమని నాకు జీవించి ఉన్నప్పుడే చెప్పడంతో వారి చివరి కోరికను తీర్చాలని ఉద్దేశంతో నేను మా కుటుంబ సభ్యులతో చర్చించి మా తండ్రి నేత్రాలను ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ టెక్నీషియన్స్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLISHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# బొగ్గులైన్ బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం.

## ..పేదలకు 'రెండు సెంట్ల' స్థలం ఇస్తాం.

## ..స్వయంగా స్థలాలను పరిశీలించిన మంత్రి ఫరూక్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 21:** నంద్యాల బొగ్గులైన్ బాధితులకు అండగా ఉంటామని, వారికి పునరావాసం కల్పించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు. గురువారం నంద్యాలలో బొగ్గులైన్ బాధితుల కొరకు స్థల సేకరణ ప్రక్రియలో భాగంగా మంత్రి ఫరూక్ స్వయంగా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. పలు అనువైన స్థలాలను నేరుగా పరిశీలించి, బాధితులకు అన్ని వసతులతో కూడిన మెరుగైన స్థలాన్ని కేటాయించాలని అధికారులను ఆదేశించారు.

**కూటమి ప్రభుత్వంలో పేదలకు 2 సెంట్ల స్థలం.. మంత్రి ఫరూక్**

ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ గతంలో జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పేద ప్రజలకు కేవలం ఒకే ఒక్క సెంటు స్థలం ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. ఒక సెంటు స్థలంలో ఇల్లు కట్టుకుని జీవించడం పేదలకు ఎంతో ఇబ్బందికరంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఇందులో భాగంగానే బాధితులకు ఇప్పుడు రెండు సెంట్ల స్థలాన్ని కేటాయించాలని నిర్ణయించినట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. “పేదలు ఆత్మగౌరవంతో, సౌకర్యవంతంగా జీవించాలనేదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పం. అందుకే గత పాలకుల వలే కాకుండా, రెండింతల స్థలాన్ని (2 సెంట్లు) బాధితులకు అందిస్తున్నాం అని మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరగతిన స్థల సేకరణ పూర్తి చేసి, పంపిణీ ప్రక్రియను చేపడతామని మంత్రి ఫరూక్ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ శేషన్న, డిప్యూటీ తాసిల్దార్ సంజీవ, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాస్, స్థానిక అధికారులు, కూటమి నాయకులు మరియు ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

# మెడికల్ దుకాణాలు బంద్ చేయడం న్యాయమేనా..?

**...ఆన్లైన్ లో మందుల విక్రయాలు చేయడం నేరమా.? ...వృద్ధులు,ఒంటరి వారికి ఆన్లైన్ సేవలు అందుకుంటున్నాయి.**


**...ఆన్లైన్ లో ఎమ్మార్పీ కంటే తక్కువ ధరకు లభ్యం. ..మెడికల్ మాఫియా తీరుకు ప్రజల్లో ఆగ్రహం.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 21:**

దేశవ్యాప్తంగా మెడికల్ దుకాణాలు బంద్ చేయడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మెడికల్ మాఫియా కు అనుగుణంగా ఉండాలనే వారి డిమాండ్ సబబు కాదని ప్రజలు పేర్కొంటున్నారు.ప్రధానంగా ఆన్లైన్ విక్రయాలు నిషేధించాలని డిమాండ్ తో ఒక్కరోజు బంద్ ప్రజలు విమర్శలు చేస్తున్నారు.దేశ వ్యాప్తంగా లక్షల్లో ఉన్న మెడికల్ దుకాణాలు మూసి వేయడంతో వారు తప్ప ఎవరు వ్యాపారం చేయకూడదా అని ప్రశ్నిస్తున్నారు.హోల్సేల్,రిటైల్ మెడికల్ దుకాణాలు చెప్పిన ధరలకే కొనుగోలు చేయాలా అని ప్రజలు పేర్కొంటున్నారు. ఉదాహరణకు పది రూపాయలకు విక్రయించే మందులు 100 రూపాయలకు విక్రయిస్తున్న ఏమి అనకుండా కొనుగోలు చేయాల్సిందే.ప్రజలు తక్కువ ధరకు ఎక్కడ దొరుకుతాయో అక్కడ కొనుగోలు చేస్తారు.ఇన్నేళ్లుగా మెడికల్ మాఫియా ఆడిందే ఆట,పాడిందే పాటగా దోచుకున్నారు.కాలానికి అనుగుణంగా ప్రజల సౌకర్యార్థం ఆన్లైన్ వ్యాపారాలు పుంజుకున్నాయి. మందుల నుంచి తినుబండారాలు,వస్తువులు అన్ని ఆన్లైన్ లో చిటికెలో కష్టపడకుండా ఇంటివద్దకే వస్తున్నాయి.వృద్ధులు,ఒంటరి జీవితం గడుపుతున్న వారికి ఆన్లైన్ విక్రయాలు ఎంతో వెసలుబాటుతో పాటు డబ్బు,సమయం ఆదా అవుతుంది.వివరాల్లోకి వెళితే దేశ వ్యాప్తంగా మెడికల్ దుకాణాలు ఆన్లైన్ మందుల విక్రయాలు నిలుపుదల చేయాలని ఒక్క రోజు బందు పాటించిన విషయం విదితమే.మెడికల్ దుకాణాలు బంద్ చేయడంతో ప్రజలు వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వారి స్వలాభం కోసం మెడికల్ దుకాణాలు బంద్ చేయడం మంచి పద్ధతి కాదని అంటున్నారు.హోల్సేల్,రిటైల్ దుకాణాల్లో ఎమ్మార్పీ కి ఒక్కరూపాయి తగ్గించరని అందరికీ తెలిసిన విషయమే.పట్టణాల్లో పలు మెడికల్ దుకాణాల్లో మా వద్ద మందులు కొనుగోలు చేస్తే ఎమ్మార్పీ పై 30 నుంచి 60 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తామని పెద్ద,పెద్ద బోర్డు లు పెట్టీ వ్యాపారాలు అభివృద్ధి చేసుకుంటున్నారు.ప్రస్తుతం వచ్చిన ఇబ్బంది ఎవరికంటే ఎమ్మార్పీ ఒక్క రూపాయి కూడా తగ్గించని వారికే ఇబ్బందులు కలుగుతున్నాయి.మేధావుల మాటల్లో ప్రస్తుతం విక్రయిస్తున్న మందులు వారికి చాలా తక్కువ ధరకు లభిస్తున్నాయని రూపాయికి వంద రూపాయలు లాభాలు గడుస్తున్నా ఆశకు అంతులేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు. వాస్తవానికి మందుల దుకాణాల్లో మందులు విక్రయించడానికి ఫార్మాసిస్టు ఉండాలి, మెడికల్ దుకాణం లైసెన్సు ఎవరిపేరు మీద ఉందో వారు మాత్రమే మెడికల్ దుకాణం నిర్వహించాలనే ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నారా.కొందరు అలా,కొందరు ఇలా మందులు వారికి నచ్చిన విధంగా ఎందుకు విక్రయాలు చేస్తున్నారు.ప్రతి మెడికల్ దుకాణాల్లో ప్రిస్కిప్షన్ లేకుండా మందులు విక్రయాలు జరపకూడదనే నిబంధనలు ఉన్నా ఆ నియమాలు పాటించరు.ప్రతి అమ్మకం పై బిల్లులు వేయకుండా కోట్లలో ప్రభుత్వానికి పన్నులు ఎగురకొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఆన్లైన్ వ్యాపారంతో వారికి నష్టమే కానీ ప్రజలకు లాభమే.మెడికల్ మాఫియా ఇప్పటికైనా స్వలాభం చూసుకోకుండా ప్రజల కు ఇబ్బందులు లేకుండా చూస్తారని ఆశిద్దాం.

## కొత్తూరులో మార్కాపురం సివిల్ జడ్జ్ ప్రత్యేక పూజలు.





**ఆంధ్ర ప్రగతి కొత్తూరు మే 20:** నంద్యాల జిల్లా పాణ్యం మండలం కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ వల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో భక్తాదులు స్వామి వారికి విశేష పూజలు జరిపించడం జరిగింది.(ఎం. బాలాజీ ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జ్) జూనియర్ డివిజన్ మార్కాపురం జిల్లా కుటుంబ సమేతంగా స్వామివారికి అభిషేకాలు, అర్చనలు,విశేష పూజలు జరిపించారు. జడ్జి ని ఆలయ మర్యాదలతో సత్కరించారు.ఈ కార్యక్రమం లో, ప్రధాన అర్చకులు సురేష్ స్వామి, ఆలయ సిబ్బంది మరియు దేవస్థాన అధికారులు పాల్గొన్నారు.

# జొన్న రైతులకు వైకాపా యువజన విభాగం అన్నదానం.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 21:**

గత మూడు రోజులుగా స్థానిక గోదాముల వద్ద పడిగాపులు కాస్తున్న జొన్న రైతులకు వైకాపా నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆదేశాల మేరకు వైకాపా జిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో గురువారం భోజన వసతి కల్పించారు. నిరుపేద రైతులు తిండి తిప్పలు మానేసి గోదాముల వద్దే బండ్లు నిలుపుకొని ఇబ్బందులు పడుతుండటాన్ని గమనించిన కాటసాని రాంభూపాల్ రెడ్డి, వారిని తక్షణమే ఆదుకోవాలని యువజన విభాగాన్ని పురమాయించారు.దీనిపై స్పందించిన జిల్లా వైకాపా యువజన విభాగం నేతృత్వంలో రైతులకు అక్కడికక్కడే అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సద్దల చంద్రశేఖర్ రెడ్డిలు మాట్లాడుతూ అన్నదాతల కష్టాలను గుర్తించి అండగా నిలవడమే తమ పార్టీ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమంలో వైకాపా యువజన విభాగం జిల్లా వైస్ ప్రెసిడెంట్ గోపురం జయప్రకాష్ నారాయణ రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ గుండం నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లాలో పెద్దపులి కలకలం..

## ఆవుల మందపై దాడి, ఆవు మృతి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మే 20:**



నంద్యాల జిల్లా వెలుగోడు పట్టణ శివారులోని నల్లమల అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న గట్టు తాండ వద్ద పెద్దపులి సంచారం స్థానికుల్లో భయాందోళనలకు గురిచేసింది. గట్టు తాండాకు చెందిన రెడ్యా నాయక్‌కు చెందిన ఆవుల మందపై పెద్దపులి దాడి చేయగా, ఒక ఆవు మృతి చెందింది. ఘటనతో అప్రమత్తమైన యజమాని రెడ్యా నాయక్ అటవీ అధికారులకు సమాచారం అందించారు. పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# నంద్యాల జిల్లాలో బిజెపి జెండా ఎగురవేస్తా..!

## ..ప్యాపిలిలో బీజేపీ జోష్.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 21-**

డోన్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్యాపిలి మండలంలో బీజేపీ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. భోంచెరుపల్లి, మామిళ్లపల్లె, జలదుర్గం గ్రామాల్లో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పలువురు యువకులు, స్థానిక నాయకులు భారతీయ జనతా పార్టీలో చేరారు. జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమాలు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

ఈ సందర్భంగా గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించిన అభిరుచి మధు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల పట్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీకి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని, యువత స్వచ్ఛందంగా పార్టీలో చేరడం ఇందుకు నిదర్శనమన్నారు.

పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. రాబోయే రోజుల్లో డోన్ నియోజకవర్గంలో బీజేపీని మరింత బలోపేతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.





## ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన వ్యవసాయ అధికారులు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 21:** నంద్యాల మండల వ్యవసాయ అధికారి, ప్రసాద రావు తో కలిసి విజిలెన్స్ ఎస్సై ప్రసాద్ నంద్యాల మండలం లో గల పలు ఎరువులు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. తనిఖీలో భాగంగా దుకాణాల యందు స్టాక్ రిజిస్టర్ ,బిల్ బుక్స్, రసీదులను,దుకాణం లోని నిలువలను పరిశీలించడం జరిగింది. అలాగే యూరియా నిల్వలను, రోజువారీ అమ్మకాలను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా దుకాణా లలో సరైన ధ్రువపత్రాలు సమర్పించనందున సుమారు 14 లక్షల విలువ గల 108 మెట్రిక్ టన్నుల ఎరువులు తాత్కాలికంగా అమ్మకపు నిలుపుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. యూరియా వివరాలను ప్రతీ రోజు వ్యవసాయ శాఖ వారు రూపొందించిన బోర్డు యందు అప్డేట్ చెయ్యాలని, స్టాక్ మరియు ధరల పట్టికను రోజు అప్డేట్ చేయాలని, ఎరువులను ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రాయించారదనీ ప్రభుత్వ అనుమతి పొందిన ఎరువులను మాత్రమే విక్రయంచాలని,అదే విధంగా పంటలు లేని సమయంలో ఎరువుల అమ్మకాల్లో నియంత్రణ పాటించాలని,అవసరమైన అన్ని ధృవ పత్రాలు దుకాణం దారులు సరిగా నిర్వహించాలని లేనిచో ఎఫ్ సి ఓ 1985 చట్టం ప్రకారం దుకాణాల పై చట్టపరమైన చర్యలు తీసుకోబడునని హెచ్చరించడం జరిగినది. కార్యక్రమం లో విజిలెన్స్ ఎస్సై ప్రసాద్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# డా. సుధాకర్ జ్ఞాపకార్థం జి ఎస్ ఆర్ హాస్పిటల్ నందు ఉచిత మెడికల్ క్యాంపు.

## ..ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఎండి. ఫిరోజ్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 21:**

నంద్యాల పట్టణంలోని జి ఎస్ ఆర్ హాస్పిటల్ నందు డా. రఫీ మరియు డా. అరిఫా భాను ఆధ్వర్యంలో డా. సుధాకర్ జ్ఞాపకార్థం ఉచిత మెడికల్ క్యాంపు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి. ఫిరోజ్ హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.





ఈ సందర్భంగా ఏన్ యం డి ఫిరోజ్ మాట్లాడుతూ.. కరోనా మహమ్మారి సమయంలో వైద్యులకు సరైన రక్షణ పరికరాలు, మాస్కులు, శానిటైజర్లు అందించాలని ప్రభుత్వాన్ని కోరిన నర్సీపట్నంకు చెందిన డాక్టర్ సుధాకర్ గారిని గత వైసీపీ ప్రభుత్వం అన్యాయంగా సస్పెండ్ చేసి, మానసికంగా మరియు శారీరకంగా వేధింపులకు గురిచేసిందన్నారు. ఒక వైద్యుడు ప్రజల ప్రాణాల కోసం మాట్లాడితే అతడిని రక్షించాల్సిన ప్రభుత్వం వేధించడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు.

కరోనా సమయంలో వైద్యులు తమ కుటుంబాలను కూడా పక్కనపెట్టి ప్రజల ప్రాణాలు కాపాడేందుకు రాత్రింబవళ్లు సేవలు అందించారని గుర్తుచేశారు. అలాంటి సేవాభావం కలిగిన డాక్టర్ సుధాకర్ గారిని అవమానించడం, మానసిక వేదనకు గురిచేయడం రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరన్నారు. డాక్టర్ సుధాకర్ మరణం కేవలం ఒక వ్యక్తి మరణం మాత్రమే కాదని, అది వైద్య వృత్తి గౌరవంపై జరిగిన దాడిగా రాష్ట్ర ప్రజలు భావించారని తెలిపారు. వైద్యుల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం వారిపై కక్ష సాధింపు చర్యలకు దిగడం దురదృష్టకరమన్నారు.

ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైద్యులకు భద్రత, గౌరవం, మెరుగైన సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వైద్య రంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సమాజ సేవలో వైద్యులు ఎప్పుడూ ముందుంటారని తెలిపారు.

నంద్యాలలో డా. సుధాకర్ జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరం ద్వారా పేద ప్రజలకు వైద్య సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డా అనిల్ కుమార్, డా రఫీ, డా అరిఫా భాను, అడ్వకెట్ బాలస్వామి, దండోరా లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ బెనర్జీ, టీడీపీ నాయకులు జోసెఫ్, నాగేశ్వర రావు, సుబ్బయ్య జూలేపల్లె వందలాది సంఖ్యలో ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల నుంచి తిరుపతి వైపు వెళ్ళు భక్తులకు శుభ వార్త.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 21:**



నంద్యాల జిల్లా నుంచి తిరుపతి వైపు వెళ్ళు రైలు ప్రయాణికులకు, శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తులకు, దక్షిణ మధ్య రైల్వే శాఖ శుభవార్త తెలిపినట్లు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి గురువారం ఓ ప్రకటన లో తెలిపారు. నంద్యాల మీదుగా తిరుపతికి సమ్మర్ స్పెషల్ వీక్లీ ట్రైన్ ను సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు నడుపనున్నారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. తిరుపతి నుంచి చర్లపల్లికి కడప, ఎర్రగుంట్ల, నంద్యాల, నడికుడి మీదుగా వారంతపు ఎక్స్ ప్రెస్ ట్రైన్ ను 17443 ను 28 వ తేదీ నడుపనున్నారని. తిరుగు ప్రయాణంలో 17444 నెంబరు ట్రైన్ ను చర్లపల్లి నుంచి నడికుడి, నంద్యాల మీదుగా ఎర్రగుంట్ల , కడప మీదుగా తిరుపతి కి 29 వ తేదీ రెండు ట్రిప్పులు నడుప నున్నారని, ఈ ట్రైన్ తిరుపతి లో సాయంత్రం 4:30 గంటలకు ప్రారంభం అయ్యి నంద్యాల కు రాత్రి 9:00 గంటలకు చేరుకొని చర్లపల్లి కి మరుసటి రోజు ఉదయం 8:30 కి చేరుకుంటుంది, తిరుగు ప్రయాణం లో చర్లపల్లి లో సాయంత్రం 4:20 కి ప్రారంభించి నంద్యాలకు అర్ధరాత్రి 12:00 గంటలకు చేరుకొని మరుసటి రోజు ఉదయం 7:30 కి తిరుపతి చేరుకుంటుందని.

నంద్యాల జిల్లా ప్రజలు, రైలు ప్రయాణికులు ఈ రైలును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు.

# నంద్యాల రైల్వే గేట్ల సమస్యలపై మంత్రి ఎన్ఎండి ఫరూక్ సమీక్ష.

## ..బొమ్మల సత్రం, గాంధీనగర్ రైల్వే గేట్ల వద్ద అండర్ పాస్ లేదా బ్రిడ్జిల నిర్మాణాలపై చర్చ.

## ..ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఉన్నతాధికారులతో మంత్రి కీలక సమావేశం.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 21:**

నంద్యాల పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన ట్రాఫిక్ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఈరోజు స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు ఒక కీలక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పట్టణంలోని రెండు ప్రధాన రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ నిర్మాణాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

**బొమ్మల సత్రం శ్రీ స్నేహ వృద్ధాశ్రమం రైల్వే గేట్**

ఈ రైల్వే గేట్ వద్ద వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ఉండటానికి 'అండర్ పాస్' నిర్మించాలా? లేదా 'ఫ్లైఓవర్ బ్రిడ్జి' నిర్మించాలా? అనే అంశంపై మంత్రి ఫరూక్ గారు అధికారులతో చర్చించారు. ప్రజలకు ఏది అత్యంత సౌకర్యవంతంగా ఉంటుందనే కోణంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించారు.



**గాంధీనగర్ రైల్వే గేట్**

అదేవిధంగా, నిరంతరం ట్రాఫిక్‌తో బిజీగా ఉండే గాంధీనగర్ సమీపంలోని రైల్వే గేట్ వద్ద కూడా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, అక్కడ అండర్ పాస్ వేయాలా లేక బ్రిడ్జి నిర్మించాలా అనే సాంకేతిక మరియు క్షేత్రస్థాయి అంశాలపై అధికారులతో సమీక్షించారు.

"నంద్యాల పట్టణ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు కలగకుండా, భవిష్యత్తు అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టులపై త్వరితగతిన నివేదికలు సిద్ధం చేయాలని . ప్రజా ప్రయోజనాలే పరమావధిగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని " మంత్రి ఎన్ఎండి ఫరూక్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డలో ఈనెల 23న ప్రజా సమస్యల పరిష్కార వేదిక.

## "వన్ మంత్ ఫోర్ విజిట్"లో భాగంగా ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 21:**



"వన్ మంత్ – ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఈనెల 23వ తేదీ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు హాజరై ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతారని కలెక్టర్ వివరించారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# తిరుమలలో పెరిగిన రద్దీ

## వేసవి సెలవులతో భక్తుల రాక

## దర్శనానికి 24గంటలకు పైగా సమయం

**తిరుమల,మే 21ఆంధ్ర ప్రగతి**

వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలలో రద్దీ పెరుగుతోంది. శ్రీవారి దర్శనానికి కనీసం 24 గంటలపైగా సమయం పడుతోంది. శ్రీవారి దర్శనానికి గురువారం కూడా భక్తుల రద్దీ కొనసాగుతోంది. దీంతో భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్2, నారాయణగిరి షెడ్స్ నిండిపోయి రింగ్ రోడ్డులోని పాచికాల్వ గంగమ్మ ఆలయం వరకు క్యూలైన్లో సుమారు నాలుగు కిలోమీటర్లు వేచి ఉన్నారు. సర్వదర్శనానికి 24 గంటలపైగా సమయం పడుతోందని తితిదే ప్రకటించింది. రద్దీ నేపథ్యంలో సంయమనంతో శ్రీవారిని దర్శించుకోవాలని తితిదే భక్తులకు సూచిస్తోంది. మరోవైపు తితిదే ఆధ్వర్యంలో ముందస్తు నియంత్రణ చర్యలు చేపట్టారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు, అన్నప్రసాద కేంద్రాలు, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు, ఆలయ పరిసర ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులు ఎప్పటికప్పుడు అంచనా వేసి, అధికారులు అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. క్యూలైన్‌లో భక్తులకు తాగునీరు, పాలు, అన్న ప్రసాదాలు శ్రీవారి సేవకుల ద్వారా అందిస్తున్నారు. తితిదే యంత్రాంగం సమన్వయంతో భక్తులకు దర్శనం కల్పించేందుకు 24 గంటలూ ప్రత్యేకంగా దృష్టి సారించారు. పోలీసులు, తితిదే విజిలెన్స్ అధికారులు రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి రద్దీని నియంత్రిస్తున్నారు. రద్దీ నేపథ్యంలో అధికారులు భక్తులను క్యూలైన్లలోకి అనుమతించడం లేదు.

# పరిశ్రమల్లో టెక్నికల్ యూరియా వాడాలి.

## ..వ్యవసాయానికి ఉపయోగించే యూరియా వాడరాదు. ..ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్,నంది డైరీ లో తనికిలు.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 21:**

నంద్యాల జిల్లా కేంద్రంలోని ఎస్ పి వై ఆగ్రో ఇండస్ట్రీస్, నంది డెయిరీ పరిశ్రమలను జిల్లా వ్యవసాయ అధికారి, నంద్యాల శ్రీ నున్న వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వ్యవసాయ, పౌరసరఫరాలశాఖ లకు సంబంధించిన అధికారుల బృందం ఆకస్మికంగా తనిఖీ చేశారు . అక్కడ ఉపయోగిస్తున్న యూరియా ను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ జిల్లా లో వివిధ పరిశ్రమలు అనగా లిక్కర్, పెయింట్స్, ప్లాస్టిక్, డెయిరీ మొదలగు వాటిని యూరియా వాడకంపై తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, సాధారణంగా పరిశ్రమలకు టెక్నికల్ గ్రేడ్ యూరియా వాడతారని, వ్యవసాయానికి వాడే యూరియా ఉపగించరాదని తెలిపారు. ప్రస్తుతం తనిఖీ చేసిన పరిశ్రమలో టెక్నికల్ గ్రేడ్ యూరియానే ఉపయోగిస్తున్నారని నిర్ధారించుకోవడం జరిగిందని తెలిపారు. కావున జిల్లాలోని వివిధ పరిశ్రమల యాజమాన్యం టెక్నికల్ గ్రేడ్ యూరియా తప్ప వ్యవసాయానికి ఉపయోగించే యూరియాను వాడరాదని, ఎవరైనా నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవసాయ యూరియా వాడితే వారిపై ఎఫ్ సి ఓ 1985 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ తనిఖీల్లో ఉప వ్యవసాయ సంచాలకులు గంగాధరరావు ,నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు, సాంకేతిక వ్యవసాయ అధికారి కళ్యాణ్ పాల్గొనడం జరిగినది.

# తెలంగాణలో కార్మికుల కనీస వేతనాలు పెంపు

## - మొత్తం 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు

## -జూన్ 1 నుంచి అమలు : సిఎం రేవంత్

**జోన్ల వారీగా పెరిగిన వేతనాలు**

| జోన్ | అన్‌స్కిల్డ్ | సెమీ స్కిల్డ్ | స్కిల్డ్ కేటగిరి | హైలీ స్కిల్డ్ కేటగిరి |
|---|---|---|---|---|
| 1 | 16,000 | 17,000 | 18,500 | 20,000 |
| 2 | 15,000 | 16,000 | 17, 500 | 19,000 |
| 3 | 14,000 | 15,000 | 16,500 | 18,000 |

**హైదరాబాద్ : ఆంధ్ర ప్రగతి**

కార్మికుల కనీస వేతనాలు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని కార్మికులను అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్ అనే నాలుగు కేటగిరీలుగా విభజించి వేతనాలను నిర్ధారించింది. కనీస వేతనాల పెంపుపై మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జోన్-1లో అన్ స్కిల్డ్ కేటగిరీలో కనీస వేతనం రూ.12,750 నుంచి రూ.16 వేలకు, సెమీ స్కిల్డ్ కేటగిరీలో రూ. 13,152 నుంచి రూ. 17 వేలకు, స్కిల్డ్ కేటగిరీలో రూ. 13,772 నుంచి రూ. 18,500కు, హైలీ స్కిల్డ్ కేటగిరీలో రూ.14,607 నుంచి రూ.20 వేలకు వేతనాలు పెంచినట్లు వెల్లడించారు. కనీస వేతనాల పెంపు నిర్ణయం ద్వారా రాష్ట్రంలో 1.11 కోట్ల మందికి లబ్ది చేకూరనుందని చెప్పారు. జూన్ ఒకటి నుంచి ఈ నిర్ణయం అమలవుతుందని వివరించారు. రాష్ట్రంలోని ప్రాంతాలను మూడు జోన్‌లుగా విభజించామని తెలిపారు. జోన్-1లో మున్సిపల్ కార్పొరేషన్లు, జోన్-2లో మున్సిపాలిటీలు, జోన్-3లో గ్రామీణ ప్రాంతాలను తీసుకుని కనీస వేతనాలను నిర్ణయించామని వెల్లడించారు. దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా కనీస వేతనాల పెంపుపై నిర్ణయం తీసుకున్నామన్నారు.

# ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై ఏపీలో కేసు నమోదు

**మే 21ఆంధ్ర ప్రగతి**

ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌పై కేసు నమోదైంది. ఓ టెలివిజన్ ఛానల్ చర్చా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ జనసేన కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కాకినాడ జిల్లా ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌లో ఆయనపై, సంబంధిత టీవీ ఛానెల్‌పై కేసు నమోదు చేశారు. జనసేన కార్యకర్తలు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, ఇటీవల జరిగిన ఓ టీవీ డిబేట్‌లో నాగేశ్వర్ మాట్లాడుతూ.. గతంలో పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్ ఢిల్లీలో అమిత్ షాను కలిసి వైఎస్ జగన్‌ను అరెస్టు చేయాలని కోరారని పేర్కొన్నారు. దీనికి అమిత్ షా స్పందిస్తూ, "రాజకీయాల్లో ఇన్‌స్టంట్ ఫ్రెండ్, లాంగ్ టర్మ్ ఫ్రెండ్ ఉంటారు. చంద్రబాబు ఇన్‌స్టంట్ ఫ్రెండ్ (తాత్కాలిక స్నేహితుడు), జగన్ లాంగ్ టర్మ్ ఫ్రెండ్ (చిరకాల మిత్రుడు). మనకు 25 మంది ఎంపీలతో జగన్ సహకరిస్తున్నారు కదా, మీరు కూడా వైఖరి మార్చుకోండి" అని వారికి సలహా ఇచ్చినట్లు నాగేశ్వర్ వ్యాఖ్యానించారు. అమిత్ షా అనని మాటలను అన్నట్లుగా ప్రచారం చేస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టించేలా నాగేశ్వర్ వ్యాఖ్యలు ఉన్నాయని జనసేన కార్యకర్తలు తమ ఫిర్యాదులో ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపడంతో, ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై, ఆ కార్యక్రమాన్ని ప్రసారం చేసిన టీవీ ఛానెల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



